
ఆంధ్రజ్యోతి
రంజాన్ వేళలు | ఇఫ్తార్: 6.32 | సహర్: 5.00 (సోమవారం)
ANDHRAJYOTHY
యాదాద్రి భువనగిరి
5
ఆదివారం 17 మార్చి 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.126	183	208
సూర్యాపేట	రూ.120	180	210
నల్లగొండ	రూ.126	184	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 38.0 । కనిష్ఠం 24.0



లోక్‌సభ ఎన్నికలకు మోగిన నగారా

» ఏప్రిల్ 18నుంచి నామినేషన్ల ఘట్టం » మే 13న పోలింగ్ » జూన్ 4న కౌంటింగ్, ఫలితాల వెల్లడి
» అమలులోకి ఎన్నికల ప్రవర్తనా నియమావళి » ఎన్నికల ఏర్పాట్లలో అధికార యంత్రాంగం » సమరానికి సై అంటున్న రాజకీయ పక్షాలు

లోక్‌సభ ఎన్నికలకు నగారా మోగింది. రాష్ట్రంలో మే 13న పార్లమెంట్ నియోజకవర్గాలకు పోలింగ్ జరగనుండగా, జూన్ 4న ఫలితాలు వెల్లడి కానున్నాయి. దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలను ఏడు దశల్లో నిర్వహిస్తుండగా, నాలుగో దశలో రాష్ట్రంలోని 17లోక్‌సభ స్థానాలకు ఎన్నిక లు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ మేరకు శనివారం ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాలోని రెండో లోక్‌సభ స్థానాలకు మే 13న పోలింగ్ జరగనుంది. నల్లగొండ, భువనగిరి లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 4, 129పోలింగ్‌స్టేష న్లలో ఈ ఎన్నిక నిర్వహించనున్నారు.నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గం లో 17,18,954 మంది ఓటర్లు, భువనగిరి లోక్‌స భనియోజకవర్గంలో 17,98,704 మంది ఓటర్లు వారి ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వెంట నే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. జూన్ 4వ తేదీ ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యాక ఫలితాన్ని వెల్లడిస్తారు. అప్పటివరకు ఎన్నిక ల కోడ్ అమలులో ఉండటంతో ప్రభుత్వానికి సంబంధించిన అన్ని అధికారిక కార్యక్రమాలకు బ్రేకుపడింది.

\- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

వెంటనే ఎన్నికల కోడ్

కేంద్ర ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించడంతో తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) అమలులోకి రావడంతో మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు ఉన్నతాధికారులు అభివృద్ధి కార్యక్రమాల ప్రా రంభాలు, శంకుస్థాపనలను ఎక్కడికక్కడ నిలిపివేశారు. అధికారయంత్రాంగం యావత్తూ ఎన్నికల సంఘం పరిధిలోకి వచ్చింది. పోలింగ్ సిబ్బంది నియామకం, ఎన్నికల నిర్వహణ, పోలీస్ బందోబస్తుకు అవసరమైన బలగాలు సమకూర్చుకోవడం, ఈవీఎం యంత్రాలను సిద్ధం చేయడం వంటి పనులన్నీ ఇప్పటికే పూర్తయ్యాయి. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం పోటీ చేసే అభ్యర్థులు రూ.90లక్షల వ్యయపరిమితికి లోబడి ఖర్చు చేయాల్సి ఉంటుంది. అదేవిధంగా ఓటర్లను ప్రభావితం చేసేలా, ప్రలోభపెట్టేలా ఏ రాజకీయపార్టీ, రాజకీయనేత, అభ్యర్థి వ్యవహరించకూడదు. ఎన్నికల ప్రసంగాల్లోనూ ప్రలోభానికి గురిచేసే హామీలివ్వకూడదు. అంతేకాకుండా కుల, మత వర్గీకరణలు, రెచ్చగొట్టే ప్రసంగాలు చేయరాదని, నేతలు, అభ్యర్థులు మాట్లాడే భాషపై నియంత్రణ ఉండాలని ఎన్నికల కమిషన్ సూచించింది.

సమరానికి సిద్ధమైన రాజకీయపక్షాలు

లోక్‌సభ ఎన్నికల్లో తలపడేందుకు రాజకీయపార్టీలు ఇప్పటికే సన్నద్ధమయ్యాయి. జిల్లాలోని రెండు సీట్లకు బీజేపీ భువనగిరి నుంచి మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, నల్లగొండ నుంచి మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అభ్యర్థిత్వాలను ఇప్పటికే ప్రకటించి ఎన్నికల రణరంగంలో ముందంజలో ఉంది. కాంగ్రెస్ తొలి జాబితాలో నల్లగొండ లోక్‌సభ సీటుకు మాజీ మంత్రి జానారెడ్డి తనయుడు కుందూరు రఘువీర్‌రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించగా, భువనగిరి స్థానం నుంచి అభ్యర్థి ఎంపికకు తీవ్ర కసరత్తు చేస్తోంది. బీఆర్ఎస్ ఇప్పటివరకు జిల్లాలోని రెండు సీట్లకు అభ్యర్థులను ప్రకటించలేదు. నేడో రేపో ఆ పార్టీ అభ్యర్థుల్ని ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. జిల్లాలో స్థిరమైన ఓటు బ్యాంకు ఉన్న సీపీఎం ఈ లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి స్థానం నుంచి పోటీ చేస్తుందని, త్వరలో అభ్యర్థిని ప్రకటిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య తెలిపారు. బీఎల్ఎఫ్ ఇప్పటికే తమ అభ్యర్థులుగా వస్కుల మట్టయ్య, నూనె వెంకటస్వామిని ప్రకటించింది. సీపీఐ, తెలంగాణ జనసమితి పార్టీలు కాంగ్రెస్‌తో పొత్తులో ఉండడంతో ఉమ్మడి జిల్లాలో రెండు సీట్లలో ఆ పార్టీ అభ్యర్థులు బరిలో నిలిచే అవకాశం లేదు. బీఎస్పీ తదితర పార్టీలు అభ్యర్థులను నిలబెట్టే అంశంపై సమాలోచనలు చేస్తున్నాయి.

నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గం

అసెంబ్లీ నియోజకవర్గం	పోలింగ్ స్టేషన్లు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	థర్డ్ జండర్	మొత్తం
నల్లగొండ	284	1,20,556	1,27,109	57	2,47,722
దేవరకొండ	308	1,31,599	1,30,241	18	2,61,858
నాగార్జునసాగర్	299	1,15,545	1,20,229	21	2,35,795
మిర్యాలగూడ	263	1,15,352	1,19,956	26	2,35,334
హుజూర్‌నగర్	308	1,21,390	1,28,692	17	2,50,099
కోదాడ	296	1,19,295	1,25,889	17	2,45,201
సూర్యాపేట	271	1,18,510	1,24,422	13	2,42,945
మొత్తం	2029	8,42,247	8,76,538	169	17,18,954
భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం					
భువనగిరి	257	1,08,598	1,11,358	1	2,19,957
ఆలేరు	309	1,16,344	1,17,497	19	2,33,860
నకిరేకల్	305	1,25,005	1,27,625	3	2,52,633
తుంగతుర్తి	326	1,28,240	1,29,752	7	2,57,999
మునుగోడు	307	1,27,547	1,28,513	3	2,56,063
జనగామ	277	1,18,929	1,22,207	9	2,41,145
ఇబ్రహీంపట్నం	319	1,69,713	1,67,298	36	3,37,047
మొత్తం	2100	8,94,376	9,04,250	87	17,98,704

ఎన్నికల ఏర్పాట్లలో అధికార యంత్రాంగం

లోక్‌సభ సార్వత్రిక ఎన్నికలకు ఉమ్మడి జిల్లా అధికారిక యంత్రాంగం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసింది. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గానికి ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కలెక్టర్ దాసరి హరిచందన వ్యవహరిస్తుండగా, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల అధికారిగా కలెక్టర్ హన్మంతు కే.జండగే వ్యవహరిస్తున్నారు. నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గం నల్లగొండ, సూర్యాపేట జిల్లాల పరిధిలో విస్తరించి ఉండగా, భువనగిరి లోక్‌సభ నియోజకవర్గం యాదాద్రి, నల్లగొండ, సూర్యాపేట, రంగారెడ్డి, జనగామ జిల్లాల పరిధిలో విస్తరించి ఉంది. నల్లగొండ నియోజకవర్గం పరిధిలో 2,029 పోలింగ్ స్టేషన్లకు 17,18,954 మంది ఓటర్లు ఉన్నారు. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో 2,100 పోలింగ్‌స్టేషన్లకు 17,98,704 మంది ఓటర్లు ఉన్నారు. ఓటర్ల జాబితా సవరణ, మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదుకు ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ వరకు గడువు ఉండడంతో ఓటర్ల సంఖ్య స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

కోడ్ కూసింది

83 రోజులపాటు పార్లమెంట్ ఎన్నికల కోడ్

» నిలిచిపోనున్న అభివృద్ధి పనులు » 239 రోజుల్లో 138 రోజులు ఎన్నికల కోడ్



ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

భువనగిరి టౌన్, మార్చి 16: ఎన్నికల కమిషన్ లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించడంతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. శనివారం ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌ను ప్రకటించిన వెంటనే అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్ జిల్లాలో 83 రోజుల పాటు కొనసాగనుంది. ఈ మేరకు మార్చి 16న నుంచి ఎన్నికల కోడ్ జూన్ 6వ తేదీ వరకు 83 రోజులపాటు అమల్లో ఉండనుంది. దీంతో అభివృద్ధి పనులపై తీవ్ర ప్రభావం పడనుంది. అయితే ఈపాటికే ప్రారంభమైన పనులను యథావిధిగా కొనసాగించే అవకాశం ఉన్నప్పటికీ నూతన పనులను ఎన్నికల కోడ్ ముగిసే వరకు చేపట్టే అవకాశం ఉండదు. రాష్ట్ర ప్రభుత్వం 100 రోజుల పాలనలో ఐదు గ్యారంటీ పథకాలను అమలుచేయగా మరిన్ని పథకాలను అమలు చేస్తామని ప్రకటించినప్పటికీ ఎన్నికల కోడ్ ముగిసే వరకు ఆగాల్సిందే. అలాగే మునిసిపల్ అవిశ్వాస రాజకీయాల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని పలు మునిసిపాలిటీల్లో ఇటీవల కొలువుదీరిన నూతన పాలకవర్గాలు పలు పనులను ప్రారంభిస్తామని ప్రకటించినప్పటికీ ఎన్నికల కోడ్‌తో బ్రేక్‌పడింది. కాగా గత అక్టోబరు 9న వెలువడిన అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌తో అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్ డిసెంబరు 5వరకు కొనసాగిన విషయం తెలిసిందే. దీంతో గత అక్టోబరు 9న ప్రాంభమైన ఎన్నికల కోడ్ నుంచి పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసే 2024 జూన్ 6 వరకు 239 రోజుల్లో 138 రోజులు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నట్లవుతోంది. అలాగే పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఉన్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో జనగాం నుంచి గెలుపొంది ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఖాళీ అయిన పట్టభద్రుల ఎమ్మెల్సీకి పార్లమెంట్ ఎన్నికల అనంతరం ఎన్నికల కమిషన్ ఎన్నిక నిర్వహించనుంది. ఈపాటికే ఓటరు జాబితాలు కూడా సిద్ధమయ్యాయి. దీంతో పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే మరోమారు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రానుంది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన మొదటి రోజు శనివారంనుంచే భువనగిరి పట్టణంలో పోలీసులు వాహనాల తనిఖీని ప్రారంభించగా గోడలపై ఉన్న పార్టీల గుర్తులను, పార్టీ పేర్లను తూడ్చడాన్ని అధికారులు ప్రారంభించారు. నాయకుల విగ్రహాలకు, అభివృద్ధి పథకాల శిలాఫలకాలకు ముసుగులు వేస్తున్నారు.

ఎన్నికల నియమావళిని అమలు చేయాలి

కలెక్టర్ హనుమంతు కే.జెండగే



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

భువనగిరి అర్బన్, మార్చి 16: రాబోయే పార్లమెంట్ ఎన్నికల నియమావళిని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్, ఎన్నికల అధికారి హనుమంతు కే.జెండగే నోడల్ అధికారులను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. నిబంధనల మేరకు షెడ్యూల్ వెలువడిన 24, 48, 72 గంటల్లో ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్, ప్రైవేట్ స్థలాల్లో పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, ప్రకటనలు, కటౌట్లు తొలగించాలన్నారు. 1950 ద్వారా కంట్రోల్ రూంకు, అదేవిధంగా 'సీ' విజిల్ యాప్ ఫిర్యాదులను 100 నిమిషాల్లో పరిష్కరించాలన్నారు. సమీక్షలో రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్, నోడల్ అధికారులు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలి

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్

భువనగిరి అర్బన్, మార్చి 16: మేలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ కలెక్టర్లను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డీజీపీ రవిగుప్తతో కలిసి ఎన్నికల నిర్వహణచారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల అయినందున నిబంధనలు కచ్చితంగా అమలు చేయడంతోపాటు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. 24, 48, 72గంటల్లో చేపట్టాల్సిన పనులు చేయాలని, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వైలెన్సు, వీవింగ్ టీంలు క్షేత్రస్థాయిలో పటిష్ఠంగా పర్యవేక్షణ చేయాలన్నారు. టోల్‌ఫ్రీ నెం. 1950, కంట్రోల్ రూం, 'సీ' విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులను పరిష్కరించి, జిల్లాస్థాయిలో 24గంటలు కంట్రోల్‌రూం పనిచేయాలన్నారు. పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్, వల్నరబుల్ మ్యాపింగ్ క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వివరాలు పంపాలన్నారు. అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టులలో నిఘా ఏర్పాట్లు చేయాలని, ప్రతీరోజు లిక్కరు అమ్మకాలపై నిఘాపెంచాలన్నారు. 'సువిధ' ద్వారా ఇచ్చే అన్ని రకాల అనుమతులకు తగు ఏర్పాట్లు చేయాలన్నారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హనుమంతు కే. జెండగే, భువనగిరి డీసీపీ ఎం.రాజేష్‌చంద్ర, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.బెన్ షాలోమ్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్

రాజకీయ కక్షతోనే కవిత అరెస్ట్

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి



భువనగిరిలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

భువనగిరి టౌన్, మార్చి 16: బీజేపీ రాజకీయ కక్షతోనే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కేంద్ర దర్యాప్తు సంస్థలతో అరెస్ట్ చేయించిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, జడ్పీచైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ ఆరోపించారు. కవిత అరెస్ట్‌ను నిరసిస్తూ శనివారం భువనగిరిలో ఆ పార్టీ ఆధ్వర్యంలో తెలిపిన నిరసనలో వారు మాట్లాడారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ ఓ అభూత కల్పన అని,ఏళ్లపాటు సాగుతున్న దర్యాప్తులో పార్లమెంట్ ఎన్నికల ముందు బీఆర్ఎస్‌ను అస్థిరపరిచే కుట్రతోనే కేంద్ర ప్రభుత్వం ఈడీతో ఎమ్మెల్సీని అరెస్ట్ చేయించిందన్నారు. దర్యాప్తులు, వేధింపులకు బీఆర్ఎస్ బెదరదని, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందన్నారు. నిరసన ర్యాలీ అనంతరం రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సుబ్బూరు బీరుమల్లయ్య మునిసిపల్ మాజీ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, కొలుపుల అమరేందర్, బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్ష,కార్యదర్శులు ఏవీ కిరణ్‌కుమార్, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, జనగాం పాండు, నీల ఓంప్రకాశ్, ఇట్టబోయిన గోపాల్ పాల్గొన్నారు. అలాగే తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో జిల్లాఅధ్యక్షుడు చందుపట్ల సుధీర్, తుంగతుర్తి సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

త్వరలో గుట్టలో మెడికల్ కళాశాల నిర్మాణం

» తరలిపోతుందన్న వదంతులు నమ్మవద్దు » ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



మెడికల్ కళాశాల స్థల మ్యాప్‌ను పరిశీలిస్తున్న విప్ బీర్ల

యాదగిరిగుట్ట రూరల్, మార్చి 16: త్వరలో యాదగిరిగుట్టలో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. శనివారం మండలంలోని మల్లాపురం గ్రామరెవెన్యూ పరిధిలోని సర్వే నెం.64లో 20 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తూ రెవెన్యూ అధికారులు ఇచ్చిన మ్యాప్‌ను పరిశీలించారు. స్థలపత్రాన్ని ఆర్అండ్‌బీ అధికారులకు అప్పగిస్తూ పనులు త్వరగా చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా అయిలయ్య మాట్లాడుతూ కళాశాల నిర్మాణం గుట్ట నుంచి తరలిపోతోందని ప్రతి పక్షనాయకులు ఆరోపణలు చేస్తున్నారన్నారు. తప్పకుండా గుట్టలోనే నిర్మాణం జరుగుతుందని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒకసారి ప్రకటించిన తర్వాత దానిని వెనక్కి తీసుకునే ప్రసక్తి లేదని, లేనిపోని వదంతులు నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ చీర శ్రీశైలం, మునిసిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్, కౌన్సిలర్లు గుండ్లపల్లి వాణీభరత్‌గౌడ్, ముక్కెర్ల మల్లేశ్‌యాదవ్, బబ్బూరి మౌనిక శ్రీధర్, బిట్టు సరోజహరీష్, నాయకులు ఎరుకల హేమేందర్‌గౌడ్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో స్నేహపూర్వక పరిష్కారాలు

జిల్లా ప్రధాన న్యాయాధికారి జయరాజు



భువనగిరి కోర్టులో లోక్ అదాలత్‌లో భాగంగా కక్షిదారులతో మాట్లాడుతున్న ప్రధాన న్యాయాధికారి జయరాజు

భువనగిరి టౌన్, మార్చి 16: లోక్ అదాలత్‌లో స్నేహపూర్వక పరిష్కారాలే ఉంటాయని జిల్లా ప్రధాన న్యాయాధికారి జయరాజు అన్నారు. శనివారం జిల్లాలోని కోర్టులలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌ను ఆయన భువనగిరిలోని జిల్లా కోర్టులో ప్రారంభించి మాట్లాడారు. క్షణికావేశం, అవగాహనారాహిత్యం, పరిస్థితుల ప్రభావంతో జరిగే తగాదాలతో నమోదైన కేసుల పేరిట ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతుండడంతో ఇరువర్గాల మధ్య మరింత శత్రుత్వం పెరగడంతోపాటు సమయం వృథా, ఆర్థికభారం పడుతుందన్నారు. కానీ ఈ తరహా కేసుల్లో పరస్పరం రాజీతో పరిష్కారమయ్యే కేసులే అధికంగా ఉంటాయని, ఇందుకు లోక్ అదాలత్‌లు సరైన వేదికలన్నారు. భార్యాభర్తలు, తండ్రీ కొడుకులు తదితర కుటుంబ కేసులు కూడా లోక్‌అదాలత్‌తో పరిష్కరించుకొని కలిసిమెలిసి ఉండటానికి పలువురు సిద్ధపడటం అభినందనీయమన్నారు. క్రిమినల్, సివిల్, ప్రీలిటిగేషన్ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలన్నారు. చట్టాలు, న్యాయ వ్యవస్థపై అవగాహన పెంపొందించుకుంటే కోర్టు వెలుపలనే కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. మరిన్ని కేసులను త్వరలో జరిగే లోక్ అదాలత్‌లో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.దశరథరామయ్య, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వర్‌రావు, అదనపు డీసీపీలక్ష్మీనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగారం అంజయ్య రాజశేఖర్‌రెడ్డి, పాల్గొన్నారు.

3,15,928 కేసులు పరిష్కారం

జిల్లాలోని కోర్టులలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో రికార్డుస్థాయిలో 3,15,928 కేసులు పరిష్కారమైనట్లు కోర్టు అధికారులు తెలిపారు. అయితే వీటిలో ట్రాఫిక్ స్పాట్ చలానా కేసులు 3,09,615 ఉండగా వీటి ద్వారా పోలీస్ శాఖకు రూ.3.36కోట్లు జరిమానా రూపంలో ఆదాయం లభించనుంది. అలాగే 6,278 క్రిమినల్ కేసులు, తొమ్మిది సివిల్ కేసులు, ప్రీలిటిగేషన్ కేసులలో 17 బీఎస్ఎన్ఎల్ బిల్లు చెల్లింపు, తొమ్మిది ఎస్‌బీఐ రుణ చెల్లింపు కేసులు పరిష్కారం అయ్యాయి.



సింహరూఢుడిగా నృసింహుడు, గోవర్ధన గిరిధారి అలంకారంలో స్వామివారు



భక్తవత్సలా.. పాహిమాం

» వైభవంగా తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు
» ఉదయం గోవర్ధనగిరిధారిగా దర్శనమిచ్చిన నృసింహుడు
» సాయంత్రం సింహరూఢుడిగా తిరువీధుల్లో విహారం

మహిమాన్విత దివ్యక్షేత్రం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో లక్ష్మీనాథుడు శనివారం 'గోవర్ధన గిరి ధారి'గా దర్శనమివ్వగా, సాయంత్రం సింహరూఢుడిగా తిరువీధుల్లో ఊరేగించారు.

•7లో..

ప్రకృతిలో భాగమై జీవించాలి

» పర్యావరణ వేత్త సురేష్ గుప్త » ఉత్సాహంగా మాక్ పార్లమెంట్



పర్యావరణ ప్రతిజ్ఞచేయిస్తున్న సురేష్ గుప్త

భువనగిరి టౌన్, మార్చి 16: ప్రజలందరూ ప్రకృతిలో భాగమై జీవించాలని పర్యావరణ వేత్త సురేష్‌గుప్త అన్నారు. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో శనివారం భువనగిరిలోని జాగృతి డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించిన మాక్ పార్లమెంట్, నారి శక్తి, చిరుధాన్యాలు, మైభారత్ సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రకృతిపైనే మానవాళి మనుగడ ఆధారపడి ఉంటుందన్నారు. చిరుధాన్యాలను పండించడం, ఆహారంగా స్వీకరించడం అలవాటుగా చేసుకోవాలన్నారు. చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందన్నారు. మహిళలు స్వయం సమృద్ధి సాధించాలన్నారు. భారతీయులందరి ఏకైక లక్ష్యం మై భారత్‌గా ఉండాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన మాక్ పార్లమెంట్ అందరినీ ఆకర్షించింది. మాక్ పార్లమెంట్‌లో సభ్యుల ప్రమాణ స్వీకారం, పలు అంశాలపై చర్చించిన తీరు, రాష్ట్రపతి, ప్రధాని, స్పీకర్, ప్రసంగాల తీరు ఉత్సాహపర్చింది. కార్యక్రమలో మహిళా సాధికారత జిల్లా మిషన్ కోఆర్డినేటర్ హర్ష, నెహ్రూ యువకేంద్రం అధికారి ప్రవీణ్‌సింగ్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ మణిపాల్‌రెడ్డి, నవభారత్ యూత్ అధ్యక్షుడు సరగడ కరుణ్, అంబేద్కర్, కొండానాయక్, తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌గా గంగాధర్

భువనగిరి అర్బన్, మార్చి 16: స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా గంగాధర్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శనివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు వెల్లడించారు. ఎఫ్ఏసీ, సీసీఎల్ఏ ఉప కార్యదర్శిగా విధులు నిర్వహించిన ఆయన బదిలీపై జిల్లాకు రానున్నారు. గత మూడు రోజులుగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా రాజేశం ఇక్కడకు బదిలీపై వస్తున్నట్లు సమాచారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కాగా ప్రభుత్వం రద్దు చేసింది.


తప్పతాగి.. ఇంటికి నిప్పుపెట్టి

● తల్లిపై దాడి
● అడ్డుకున్న స్థానికులకు బెదిరింపు

ఆత్మకూర్(ఎస్), మార్చి 16: మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని తల్లిపై దాడికి యత్నించాడో కుమారుడు. ఆమె తప్పించుకోవడంతో కోపంతో ఇంట్లోని దుస్తులకు నిప్పంటించి, ఇల్లు తగులబెట్టాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని పాతర్లపహాడ్ గ్రామంలో శనివారం సాయంత్రం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చిలుకూరి బాలయ్య, ఉప్పలమ్మల కుమారుడు విక్రమ్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తుండగా వివాహం కాలేదు. తండ్రి బాలయ్య చర్చి పాస్టర్ కాగా, ఉప్పలమ్మ కూలిపనులు చేస్తుంది. మద్యానికి బానిసైన విక్రమ్ మద్యం డబ్బుల కోసం తరుచూ తల్లిదండ్రులను వేధించేవాడు. విక్రమ్ రెండు రోజులుగా మద్యం కోసం డబ్బులు ఇవ్వాలని తల్లిని వేధిస్తున్నాడు. శనివారం కూడా డబ్బులు ఇవ్వాలని తల్లిపై దాడికి యత్నించగా ఆమె తప్పించుకుంది. ఆ కోపంతో మద్యం మత్తులో ఉన్న విక్రమ్ తన ఇంట్లోని బీరువాలో తల్లి దుస్తులు తీసి తగలబెట్టి తలుపులు పె ట్టాడు. ఆ మంటలు ఇంటికి అంటుకొని ఇంట్లో సామానుతో పాటు దుస్తులు పూర్తిగా కాలిపోయాయి. చుట్టుపక్కల వారు మంటలను ఆర్పేందుకు రాగా విక్రమ్ గ్రామస్థులను బెదిరించాడు. గ్రామస్థులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వటంతో వారు వచ్చి మంటలు అదుపు చేశారు. అప్పటికే ఇంట్లో ఉన్న సామాన్లు, దుస్తులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ఇంటి నుంచి మంటలు రావడంతో విక్రమ్ అక్కడినుంచి పారిపోయాడు.



ఇంటి నుంచి వస్తున్న మంటలు







భక్తవత్సలా.. పాహిమాం

● లక్ష్మీనృసింహుడి సన్నిధిలో వైభవంగా తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు ● ఉదయం గోవర్ధనగిరిధారిగా దర్శనమిచ్చిన నృసింహుడు ● రాత్రికి సింహారూఢుడిగా తిరువీధుల్లో విహారం

యాదగిరిగుట్ట, మార్చి 16: మహిమాన్విత దివ్యక్షేత్రం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. లోక కల్యాణం కోసం నిర్వహిస్తున్న స్వామివారి బ్రహ్మోత్సవాల్లో లక్ష్మీనాథుడు నృసింహుడు శనివారం 'గోవర్ధన గిరిధారి'గా శ్రీకృష్ణుడి అలంకరణలో పెళ్లి కొడుకుగా సేవలు అందుకోగా భక్తులు దర్శించుకుని తరించారు. ప్రధానాలయ ప్రాకార మండపంలో స్వామివారిని పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రాభరణాలతో దివ్య మనోహరంగా గోవర్ధనగిరిధారి అలంకరణలో తీర్చిదిద్దిన సేవలో అధిష్ఠింప జేశారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ప్రధానాలయ తిరువీధుల్లో అలంకార సేవను ఊరేగింపు నిర్వహించిన ఆచార్యులు తూర్పు రాజ గోపురం ముందు వేదికపై తీర్చిదిద్దారు. అర్చకులు, వేదపండితులు, రుత్వికస్వాములు అలంకారసేవ ముందు వేదిపారాయణ పఠనం జరిగింది. వైదిక పర్వాలు దేవస్థాన ప్రధానార్చకులు నల్లన్‌థిఘళ్ లక్ష్మీనరసింహచార్యులు, కాండూరి వెంకటాచార్యుల ఆధ్వర్యంలో కొన సాగాయి. కార్యక్రమంలో హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఇన్‌చార్జి ఈవో ఎం. రామకృష్ణారావు పాల్గొన్నారు.

ప్రత్యేక ఘట్టం

భక వత్సలా!.. శ్రీకృష్ణా ప్రభూ.. మమ్ములను రక్షింపనీవే సమర్థుడవు.. పాహిమాం ప్రభూ.. అంటూ గోపాలురులు స్వామివారిని వేడుకోగా జీవులను, వేదములను, ఇంద్రియములను సంరక్షించడం కోసం తన మహిమలను లోకానికి చాటిన ప్రత్యేక ఘట్టం గోవర్ధనగిరిధారి అలంకారం. పట్టు పీతాంబురాలు, చేతిలో పిల్లన గ్రోవి.. ఎడమచేతి చిటికెన వేలిపై గోవర్ధన పర్వతాన్ని స్వామి ధరించి తీరును అద్భుతమని, ద్వాపర యుగంలో నందుడి రాజ్యాన్ని అల్లకల్లోలం చేసేందుకు ఇంద్రుడి ఆజ్ఞ మేరకు అగ్నిదేవుడు కురిపించిన నిప్పుల వర్షం నుంచి గోకులాన్ని రక్షించిన తీరులో యాదాచలేశుడు తన ఆపన్న హస్తాలతో యావత్ భక్తజనావళిని రక్షిస్తున్నాడని అలంకార సేవ వైభవాన్ని ఆచార్యులు భక్తులకు వివరించారు.

సింహారూఢుడిగా తిరువీధుల్లో విహారం

దుష్ట శిక్షణ..శిష్ట రక్షణకు నృసింహుడిగా అవతరించిన స్వామివారు మృగరాజు సింహవాహనంపై భక్తుల పూజలు అందుకున్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో రాత్రి వేళ దివ్యవాహన సేవలు అందు కోవ డం ఆలయ సంప్రదాయం. దివ్యాభరణలతో తేజో రూపుడైన నారసింహు డు అటవికే మహారాజైన సింహవాహనంపై అధిష్ఠించి దర్శనమిచ్చారు. .

శ్రీవైష్ణవ సేవా సమాఖ్య ప్రభాతభేరి

స్థానిక శ్రీవైష్ణవ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రభాతవేళ ప్రభాతభేరి కార్యక్రమం కొనసాగాయి. శ్రీవైష్ణవస్వాములు, రుత్వికులు లక్ష్మీనృసింహుడి కరావలంబ స్తోత్రం, విష్ణు సహస్రనామ పఠనాలతో తిరువీధుల గుండా ప్రదక్షిణంగా ప్రధానాలయంలోనికి చేరుకున్నారు. గర్భాలయంలోని స్వయంభువుల సన్నిధిలో ప్రత్యేక పూజలు చేపట్టారు.


సింహవాహన అలంకార సేవోత్సవం

ప్రసాదాల తయారీ పరిశీలన

యాదగిరీశుడి పులిహోర ప్రసాదంలో ఎలుక ప్రత్యక్షమైనట్లు వచ్చిన వార్తలకు స్పందిస్తూ ప్రసాదాల తయారీని దేవాదాయశాఖ అడిషనల్ డిప్యూటీ కమిషనర్ కృష్ణవేణి శనివారం పరిశీలించారు. ప్రసాదాల తయారీ, ప్యాకింగ్ విధానాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పులిహోర ప్రసాదం తయారీ మొత్తం యంత్రాల ద్వారా జరిగినా ప్యాకింగ్ మాత్రం శ్రీవైష్ణవ, బ్రాహ్మణ వంటస్వాములచే నిర్వహిస్తున్నట్లు గుర్తించినట్లు, నివేదిక అందజేయనున్నట్లు దేవస్థాన అధికారులు పేర్కొన్నారు.

అలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం శ్రీసాయిశ్రీనివాస భజన మండలి, శ్రీభక్తరామదాసు భజన మండలి, బూడిద సత్తయ్యబృందంచే భక్తి భజనలు, వింజమూరి విజయకుమారాచార్యులచే నృసింహతత్వంపై ఆధ్యాత్మిక ఉపన్యాసం, పాల రామాంజనేయ భాగవతార్‌చే సీతాకల్యాణం హరికథా కాలక్షేపాలు, సాయంత్రం మహతీ ఆర్ట్స్ బృందంచే భక్తి సంగీత విభావరులు, భ్రమరాంబ, నాగదుర్గ, శ్రీసురభి అకాడమి ఆఫ్ ఫర్ఫార్మింగ్, కుమారి అంకం శిరీష, లాస్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్ ఇతర కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


సేవోత్సవంలో పాల్గొన్న చైర్మన్ నరసింహమూర్తి, ఈవో భాస్కర్‌రావు

స్వామివారి ఎదుర్కోళ్లు.. కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు

వార్షిక బ్రహ్మోత్సవాల్లో విశేష ఘట్టాలైన స్వామి, అమ్మవార్ల ఎదుర్కోళ్ల మహోత్సవం, తిరుకల్యాణోత్సవాల నిర్వహణ కోసం దేవస్థాన అధికారులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ప్రధానాలయ తూర్పు పంచతల రాజగోపురం ముందు గోల్డెన్ క్యూలైన్ ప్రాంతంలో స్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు వేడుకలను నిర్వహించేందుకు వేదికను . కాగా ఆదివారం రాత్రి స్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవ వైదిక పర్వాలు సంప్రదాయరీతిలో కొనసాగనున్నాయి.

యాదగిరికొండపై భక్తుల సందడి

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శనివారం భక్తుల సందడి నెలకొంది. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి దేవదేవుడి దర్శనాల కోసం క్యూలైన్లలో బారులు తీరారు. భక్తుల సంచారంతో కొండకింద కల్యాణకట్ట, లక్ష్మీపుష్కరిణి, బస్‌స్టాండ్‌లు, కొండపైన ఆలయ తిరువీధులు, ఉభయ దర్శన క్యూలైన్లు, ప్రధానాలయం, ప్రసాదాల విక్రయశాల తదితర ప్రాంతాలు కోలాహలంగా కనిపించాయి. ధర్మదర్శనాలకు రెండు గంటలు, ప్రత్యేక దర్శనాల్లో గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. సుమారు 20వేల మంది యాదగిరిక్షేత్రాన్ని సందర్శించుకున్నారని, వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.24,22,074 ఆదాయం సమకూరినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. స్వామికి నిత్య పూజలు ఆగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. వేకువజామున సుప్రభాతం, బిందెతీర్థంతో నిత్యారాధనలు ఆరంభించిన ఆచార్యులు రాత్రి వేళ శయనోత్సవ పర్వాలతో ఆలయ ద్వార బంధనం చేశారు. కొండపైన అనుబంధ శివాలయంలో రామలింగేశ్వర స్వామికి, ముఖమండపంలో స్ఫటిక మూర్తులకు నిత్య పూజలు, నిత్యరుద్ర హవనం, కొండకింద వ్రత మండపంలో సత్యనారాయణస్వామి వ్రత పూజలు శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. స్వామిని హైకోర్టు అడ్వకేటు జనరల్ ఎ సుదర్శన్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి పూజలనంతరం ఆశీర్వచనం నిర్వహించారు.



రెండు గ్రామాల మధ్య చేపల చెరువు వివాదం

● చేపలు పట్టుకునే హక్కు ఇవ్వాలంటున్న సింగారం గ్రామస్థులు, ● మత్స్య సహకార సంఘం తమ గ్రామ పరిధిలో ఉందంటున్న చాడ గ్రామస్థులు

ఆత్మకూరు(ఎం) మార్చి 16: యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలోని సింగారం గ్రామస్థులు, మోటకొండూరు మండలం చాడ గ్రామ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యుల మధ్య చెరువులో పెంచిన చేపలు పట్టే విషయంలో వివాదం నెలకొంది. తమ గ్రామానికి చెందిన చెరువులోని చేపలు పట్టుకుంటామని సింగారం గ్రామస్థులు, మీకు హక్కు లేదని చాడ గ్రామానికి చెందిన మత్స్యకారుల మధ్య పంచాయితీ కొనసాగుతోంది. రెండు గ్రామాల మత్స్యకారుల వాదన ప్రకారం... మండలంలోని సింగారం గ్రామంలోని బండ చెరువులో మూడేళ్ల క్రితం ప్రభుత్వం చేప పిల్లలు వదిలింది. సింగారం బండ చెరువు చాడ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పరిధిలో ఉంది. మూడేళ్లుగా మత్స్యకారులు చేపలు పట్టలేదు. చాడ గ్రామానికి చెందిన కొందరు మత్స్యకారులు మాస్కులు ధరించి, కర్రలతో ఈ నెల 12వ తేదీ రాత్రి సింగారం వచ్చారని గ్రామస్థులు అన్నారు. వారిని పట్టుకొని అదే రాత్రి గ్రామపంచాయతీ వద్దకు తీసుకొచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చి అప్పగించామని గ్రామస్థులు తెలిపారు. తాము చెరువు కాపలా కోసం వస్తే పట్టుకొని గ్రామపంచాయతీ కార్యాలయంలో బంధించారని చాడ గ్రామ మత్స్యకారులు సింగారం గ్రామస్థులపై కేసు పెట్టారు. ఏడుగురిపై కేసు నమోదు చేశారు. దీంతో చేపలు పట్టే విషయంలో వివాదం మరింత ముదిరింది.


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సింగారం గ్రామస్థులు

మా చెరువులో చేపలు పట్టుకునే హక్కు మాకే ఇవ్వాలి

తమ ఊర్లోని చెరువులో చేపలు పట్టుకునే హక్కు మాకే ఇవ్వాలని సింగారం గ్రామస్థులు డిమాండ్ చేశారు. సుమారు 30మంది గ్రామస్థులు శనివారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని తమ గ్రామస్థులపై కేసులు ఎందుకు పెట్టారని ఎస్‌ఐ నాగరాజును ప్రశ్నించారు. గ్రామానికి వచ్చిన వ్యక్తులను గ్రామపంచాయతీ కార్యాలయంలో బంధించే హక్కు లేదని ఎస్‌ఐ వారితో అన్నారు. అనంతరం గ్రామస్థులు తహసీల్దార్‌కార్యాలయం ఎదుట కొద్దిసేపు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ఎలాంటి వనరులు లేవని, చేపలు అమ్ముకునే హక్కు తమకే కల్పించాలని డిమాండ్ చేశారు. తమ ఊరి చెరువులో పెంచిన చేపలను పక్క ఊరి వారు పట్టుకుపోతామంటే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. మా ఊరి చెరువుపై హక్కులు కల్పించే వరకు పోరాడుతామన్నారు. ఎస్‌ఐ నాగరాజు, డిప్యూటీ తహసీల్దార్ సఫియోద్దీన్ గ్రామపెద్దలకు నచ్చజెప్పె ప్రయత్నం చేసినా ఒప్పుకోలేదు. ఎస్‌ఐ, డీటీలు ఈ విషయాన్ని జిల్లా మత్స్యశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లగా చెరువులో చేపలు పట్టుకునే హక్కు మత్స్యకారులకు మాత్రమే ఉంటుందని గ్రామస్థులకు ఉండదని, ఈ విషయంపై గురువారం మాట్లాడుదామని చెప్పడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ సఫియోద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు.

చదువుకు తగిన ఉద్యోగం రాలేదని ఆత్మహత్య

నల్లగొండ టౌన్, మార్చి 16: చదువుకు తగిన ఉద్యోగం రాలేదని మనస్తాపం చెందిన ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన గోలి వెంకన్న ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుండగా, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు గోలి నాగరాజు(25) 2022లో బీటెక్ పూర్తిచేసి స్థానికంగా ఓ కారు షోరూంలో సేల్స్‌మన్‌గా పనిచేస్తున్నాడు. సున్నిత మనుస్కుడైన నాగరాజు తన చదువుకు తగిన ఉద్యోగం రాలేదని, భవిష్యత్‌లో కుటుంబాన్ని ఎలా పోషించాలని స్నేహితుల వద్ద బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో నాగరాజు శుక్రవారం సాయంత్రం పట్టణంలోని రాక్‌హిల్స్ కాలనీ వెనకాల గల గ్రీన్‌హిల్స్ కాలనీ సమీపంలో పురుగుల మందు తాగాడు. ఈ విషయాన్ని తన స్నేహితులకు ఫోన్ చేసి చెప్పాడు. వారు హుటాహుటిన అక్కడికి చేరుకోగా అపస్మారకస్థితిలో ఉన్నాడు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. నాగరాజు తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. చిన్న కుమారుడు పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు.


నాగరాజు(ఫైల్)

గడ్డి మందు తాగి యువకుడు..

మోత్కూరు: యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని బుజిలాపురం గ్రామానికి చెందిన నేవూరి నర్సిరెడ్డి, మాయమ్మ దంపతుల కుమారుడు నేవూరి మహిపాల్‌రెడ్డి(24) ఈ నెల 15న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అతన్ని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడని ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. మహిపాల్‌రెడ్డికి ఫిట్స్ వ్యాధి ఉండడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని మేనమామ రాజిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


మహిపాల్‌రెడ్డి(ఫైల్)

వైద్యం వికటించి బాలుడు మృతి

హుజూర్‌నగర్, మార్చి 16: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం వికటించి శనివారం బాలుడు మృతిచెందాడు. తల్లిదండ్రులు, బంధువులు ఆసుపత్రి ఎదుట బాలుడి మృతదేహంతో ధర్నాకు దిగారు. డాక్టర్ నిర్లక్ష్యంతోనే బాలుడు మృతిచెందాడని ఈ సందర్భంగా తల్లిదండ్రులు ఆరోపించారు. ఆసుపత్రి ఎదుట ధర్నా చేయడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కాగా కొద్దిసేపు ఆసుపత్రి ఎదుట ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. వెంటనే పెద్దమనుషులు సంఘటన స్థలానికి చేరుకుని బాలుడి కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గరిడేపల్లి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన లొడంగి సాయికృష్ణ, శిరీష దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా పెద్దకుమారుడు లొడంగి రితిక్‌సిద్ధార్థ(5) విరేచనాలతో బాధపడుతుండగా బాలుడి తల్లిదండ్రులు ఆర్‌ఎంపీని సంప్రదించగా హుజూర్‌నగర్‌కు తీసుకెళ్లాలని ఆర్‌ఎంపీ సూచించారు. దీంతో శుక్రవారం హుజూర్‌నగర్ పట్టణంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం రితిక్‌సిద్ధార్థ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. బాలుడి తండ్రి సాయికృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ ముత్తయ్య తెలిపారు.


రితిక్‌సిద్ధార్థ మృతదేహం

మద్యం మత్తులో ఆటో డ్రైవర్ బీభత్సం

భువనగిరి టౌన్, మార్చి 16: మద్యం మత్తుతో డ్రైవర్ శనివారం రాత్రి భువనగిరిలో బీభత్సం సృష్టించాడు. స్థానిక తారకరామానగర్‌కు చెందిన వెంకటేష్ మద్యం సేవించి నడుపుతున్న ఆటో అదుపు తప్పి నల్లగొండ రోడ్డు వెంట గల శివనగర్‌లో రోడ్డు పక్కనే బైక్ ఆపి మాట్లాడుతున్న గాంధీనగర్‌కు చెందిన ఏ భానుపైకి దూసుకెళ్లింది. దీంతో భాను కాళ్లు విరిగాయి. అదే వేగంతో పక్కనే కుమ్మరివాడలోని రహదారి వెంట విక్రయానికి ఉంచిన కుండలపైకి దూసుకెళ్లింది. ఆటోను గమనించిన కుండల వ్యాపారి మరికొండ కవితతో పాటు కుండలు కొంటున్న మరో ఇద్దరు అప్రమత్తమై పరుగులు తీశారు. దీంతో పెను ముప్పు తప్పింది. అక్కడున్న యువకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన భానును జిల్లా ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


ధ్వంసమైన కుండలు

చికిత్సపొందుతూ ఇద్దరు మృతి

వలిగొండ, చిట్యాల, మార్చి 16: చికిత్సపొందుతూ ఇద్దరు మృతిచెందారు. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని మునగాల తుర్కపల్లి గ్రామానికి చెందిన బద్దం యాదమ్మ(70) పేరుమీద ఉన్న మూడెకరాల వ్యవసాయ భూమిని పెద్ద కోడలు స్వరూప, ఆమె మనుమడు రామిరెడ్డి పేర్ల మీదకు మార్చాలని మార్చి 12న కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. వృద్ధురాలిని మోత్కురులో తన కుమార్తె సువర్ణ ఇంటికి తీసుకెళ్లారు. 15వ తేదీ శుక్రవారం రాత్రి యాదమ్మ తీవ్ర అస్వస్థతకు గురికాగా మోత్కూరులో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం రాత్రి మృతిచెందిదని ఎస్‌ఐ మహేందర్‌లాల్ తెలిపారు. యాదమ్మ చిన్న కుమారుడు మల్లారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. నల్లగొండ జిల్లా చిట్యాల శివారులోని ఓ దాబహోటల్ వద్దకు ఈ నెల 14వ తేదీన గుర్తు తెలియని వ్యక్తి భోజనం చేయడానికి వచ్చాడు. భోజనం చేస్తూ మూర్ఛ వ్యాధికి గురై కుర్చీలో నుంచి కింద పడిపోయాడు. చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్‌ఐ సైదాబాబు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

చిట్యాల, గరిడేపల్లి, మార్చి16: నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. కరీంనగర్ జగిత్యాలకు చెందిన వనం రాములు(48) నల్లగొండ జిల్లా చిట్యాలలో ఉంటున్న తన కూతురిని చూడడానికి ఆయన భార్య వెంకటమ్మతో కలిసి చిట్యాలకు వచ్చాడు. టీ తాగుతానని శుక్రవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వచ్చిన అతడు భువనగిరి రోడ్‌లో గల పెట్రోల్ బంక్ వద్ద రోడ్డు దాటుతుండగా చిట్యాల నుంచి భువనగిరి వైపు వెళుతున్న డీసీఎం వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన రాములు అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్‌ఐ సైదాబాబు తెలిపారు. రాములు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అదేవిధంగా చిట్యాల జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సూర్యాపేట మండలంలోని సోలిపేట గ్రామానికి చెందిన తలారి రవి(30) మృతిచెందాడు. బైక్‌పై సూర్యాపేట నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా చిట్యాల రైల్వేస్టేషన్ వద్ద రోడ్డు క్రాస్ చేస్తున్న కారు ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన రవి అక్కడికక్కడే మృతిచెందాడు. రోడ్డు ప్రమాదంతో హైవేపై కొద్దిసేపు ట్రాఫిక్ జామ్ అయింది.

మూలమలుపు వద్ద

సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం మర్రికుంట గ్రామ సమీపంలో శనివారం సాయంత్రం కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మఠంపల్లి మండలం బిల్యానాయక్ తండాకు చెందిన ధరవత్ నవీన్(21) సొంత పనుల నిమిత్తం గరిడేపల్లి నుంచి సూర్యాపేట వెళుతుండగా మండల పరిధిలోని మర్రికుంట గ్రామ సమీపంలో గల మూలమలుపు వద్ద రాగానే సూర్యాపేట నుంచి గరిడేపల్లి వైపు వస్తున్న కారు బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న ధరావత్ నవీన్‌కు తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు 108కు ఫోన్ చేయగా క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో హుజూర్‌నగర్ ఏరియా హాస్పటల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఈ విషయంపై పోలీసులను సమాచారం కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని ఇద్దరికి గాయాలు

మోతె: సూర్యాపేట జిల్లా మండల పరిధిలోని రాఘవాపురం క్రాస్‌రోడ్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు, 108సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లాకేంద్రానికి చెందిన వి. అఖిల్ అతని స్నేహితుడు గోపీచంద్ కలిసి ఖమ్మం నుంచి బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తున్నారు. రాఘవాపురం క్రాస్‌రోడ్ వద్ద ఉన్న ఫ్లైఓవర్ దిగుతుండగా వెనకాల నుంచి వస్తున్న హుస్సేనాబాద గ్రామానికి చెందిన ధన్యం లోడుతో సూర్యాపేటకు వెళుతున్న ట్రాక్టర్ బైక్ వెనకాల ఢీకొట్టడంతో రోడ్డు పక్కన పడిపోయారు. బైక్ ధ్వంసం కాగా అఖిల్ కాలు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. గోపిచంద్ తలకు నడుముకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 సిబ్బంది సూర్యాపేట ఆసుపత్రికి తరలించారు. ధ్వంసమైన బైక్‌ను పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కల్నల్ వినయ్‌భానురెడ్డి జీవితం స్ఫూర్తిదాయకం


వినయ్‌భానురెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే అయిలయ్య, బంధు మిత్రులు

బొమ్మలరామారం, మార్చి 16: కల్నల్ వినయ్‌భానురెడ్డి యువతకు ఆదర్శమని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. శనివారం బొమ్మలరామారం మండల కేంద్రంలోని గుడిబావి వద్ద లెఫ్టినెంట్ కల్నల్ వినయ్ భానురెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన కాంస్య విగ్రహాన్ని బీర్ల అయిలయ్య కల్నల్ కుటుంబ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశరక్షణ కోసం తన ప్రాణాలను అర్పించడం, దేశం కోసం సేవ చేయడం గొప్ప భాగ్యమని, అలాంటి కల్నల్ జీవితాన్ని ప్రతీ యువకుడు స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ గూదె బాలనర్సింహ, ఎంపీపీ చిమ్ముల సుధీర్‌రెడ్డి, ఎంపీటీసీలు ఈదమ్మ, ఫక్కీర్ రాజేందర్‌రెడ్డి, రాష్ట్ర ఆదివాసీ ఎస్టీ సెక్రటరీ మడావత్ రాజునాయక్, తాజా మాజీ సర్పంచ్ రాంపల్లి మహేష్‌గౌడ్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సింగిర్తి మల్లేశం, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరాములు నాయక్, నాయకులు మోకు మధుసూదన్‌రెడ్డి, రాజేష్, గుర్రాల లక్ష్మారెడ్డి, సత్తిరెడ్డి మర్రి భగవంత్‌రెడ్డి, మర్రి కృష్ణారెడ్డి, వంశీ రెడ్డి పాల్గొన్నారు.

రావి నారాయణరెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలి


విద్యార్థులకు పరీక్షల సామగ్రి అందజేస్తున్న రావి ప్రతిభ

భువనగిరి రూరల్, మార్చి 16: పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత, ఉత్తమ పార్లమెంటేరియన్, సాయుధ పోరాట యోధుడు రావి నారాయణరెడ్డి జీవితాన్ని ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆయన మనుమరాలు రావి ప్రతిభ అన్నారు. శనివారం రావి జ్ఞాపకార్థం మండలంలోని ఆయన స్వగ్రామమైన బొల్లేపల్లి జడ్పీహైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్, జామెట్రికల్ బాక్సులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఏటా రావి స్వగ్రామంలో పేదల సంక్షేమానికి, విద్యార్థుల ఉన్నత చదువులకు తమ వంతుగా ప్రోత్సాహం అందజేస్తున్నామన్నారు. హెచ్‌ఎం పాండునాయక్ ఉన్నారు.

బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి


జ్యోతిని వెలిగిస్తున్న ప్రిన్సిపాల్ సరోజనమ్మ

చౌటుప్పల్ టౌన్, మార్చి 16: విద్యార్థినులు శ్రద్ధగా చదివి, బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని చౌటుప్పల్ ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె.సరోజనమ్మ కోరారు. స్థానిక ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థినులకు 9వ తరగతి విద్యార్థినులు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు చదివిన మధుర క్షణాలు, ఉపాధ్యాయులు చేసిన బోధనలను గుర్తుకు చేసుకొని విద్యార్థినులు భావోద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినులు చేసిన నృత్య రూపకాలు అలరించాయి. 10వ తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలను సాధించి, తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తేవాలని ప్రిన్సిపాల్ కోరారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి నగదు ప్రోత్సాహకం

ఆత్మకూరు(ఎం), మార్చి 16: మండలంలోని కూరెళ్ల ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలో మండలస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారికి రూ.25000, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థులకు రూ.15000 నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు గ్రామ తాజా మాజీ సర్పంచ్ బాషబోయిన ఉప్పలయ్య, మాజీ ఎస్ఎంసీ ఛైర్మన్ ఎరుకల స్వామి ప్రకటించారు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పదో తరగతి విద్యార్థులకు సర్టిఫికెట్ ఫైల్స్‌ను అందజేశారు.

యాదవుల సంక్షేమానికి ప్రభుత్వం చొరవ చూపాలి


యాదవ విద్యావంతుల వేదికలో సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

భువనగిరి రూరల్/ మోత్కూరు, మార్చి 16: యాదవుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ చూపాలని యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చిలకాని వెంకట్ యాదవ్ అన్నారు. శనివారం భువనగిరిలో యాదవ విద్యావంతుల వేదిక పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాదవులకు రాజకీయంగా ఆర్థికంగా వెసులుబాటు కల్పించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. సమావేశంలో గౌరవ సలహాదారుడు బేరి రాంచందర్‌యాదవ్, జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి ఆనంద్‌యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు అవిశెట్టి కిరణ్‌కుమార్, ఎంపీపీ నరాల నిర్మల వెంకటస్వామియాదవ్, మాజీ ఎంపీపీ తోటకూరి వెంకటేష్‌యాదవ్, నాయకులు యాద మల్లయ్య, సింగరబోయిన మల్లేష్ యాదవ్, రాసాల దత్తు యాదవ్, శెట్టి రాములు ఉన్నారు. ఇదిలా ఉండగా యాదవ విద్యావంతుల వేదిక మోత్కూరు మండల అధ్యక్షుడిగా దొండ శ్రీశైలం, ఉపాధ్యక్షుడిగా వర్రె మహేందర్, మోత్కూరు పట్టణ అధ్యక్షుడిగా బట్టు నరేష్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు లోడంగి మహేష్ సింహాద్రి, సతీష్, వీరస్వామి, మధు, బాలకిషన్ పాల్గొన్నారు.

'నాంచారమ్మ జాతరకు నిధులు కేటాయించాలి'

భువనగిరి అర్బన్, మార్చి 16: ఎరుకల నాంచారమ్మ జాతరకు రూ.5లక్షల నిధులు కేటాయించాలని కలెక్టర్‌ను జిల్లా ఎరుకల సంఘం (కుర్రు) అధ్యక్షుడు కూతాడి సురేష్ కోరారు. కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్ హనుమంతు కే.జెండగేకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూదాన్ పోచంపల్లి మండలం పిల్లాయిపల్లిలో గ్రామ చివరి నుంచి గుడి వరకు సీసీ రోడ్డు మంజూరు చేసి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, వేసవి దృష్ట్యా మంచినీరు ఏర్పాటు చేయడంతో పాటు వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. గుడిని సందర్శించి అక్కడి ఏర్పాట్లు, సమస్యలపై త్వరలో సన్నాహక సమావేశం ఏర్పాటు చేసి అన్ని విధాలుగా సహకరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో సంఘం కూతాడి యాదగిరి, కూతాడి వెంకటేశ్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం..అభివృద్ధే ధ్యేయం


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

అడ్డగూడూరు, మార్చి 16: ప్రజాసంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శనివారం మండలంలోని చౌళ్లరామారం నుంచి శాలిగౌరారం మండలం గురజాల వరకు రూ.25కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో 10సంవత్సరాలు బీఆర్ఎస్ పాలనలో తుంగతుర్తి నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన మూడు నెలల్లోనే ఈ నియోజకవర్గంలో రూ.13కోట్లతో ఈజీఎస్ పనుల కింద అన్ని గ్రామాలకు ప్రాధన్యం ఇచ్చిందని అన్నారు. నియోజకవర్గంలో పుట్టిన బిడ్డగా తనకు తుంగతుర్తిపై పూర్తి స్థాయిలో అవగాహన ఉందని అన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీలకు ఒక్క సీటు కూడా రాదు అని అన్నారు. ఎంఐఎం పార్టీకి మాత్రం ఒక సీటు వస్తుందని అన్నారు. కాంగ్రెస్ 16సీట్లు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోతుందని నీళ్ల మొత్తం అక్టోబరులో తీసివేశారని అన్నారు. అందుకే ఈ నియోజకవర్గంలో నీళ్ల లేక పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం కావాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నిమ్మన గోటి జోజి, ఎంపీటీసీ పెంట్యాల భారతమ్మ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోలెబోయిన లింగయ్యయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాచకొండ రమేష్, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ చిత్తలూరి హన్మంతరావు, నాయకులు ఇటికాల చిరంజీవి, కొప్పుల నిరంజన్‌రెడ్డి, పాశం సత్యనారాయణ, వల్లంభట్ల రవీందర్‌రావు, ముస్కు భిక్షం రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మల్లేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం కృషి చేయాలి : ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ పార్టీ పటిష్టానికి కృషి చేయాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. భూదాన్‌పోచంపల్లికి చెందిన చింతకింది కృష్ణారెడ్డిని యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ, నియామక పత్రాన్ని శనివారం అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో కచ్చితంగా అమలు చేసి ముందుకు సాగుతున్న ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. కాగా, చింతకింది కృష్ణారెడ్డి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి సురేష్, జిల్లా అధ్యక్షుడు బర్రె జహంగీర్, అసెంబ్లీ అధ్యక్షుడు అవేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.


చింతకింది కృష్ణారెడ్డికి నియామకపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

రాజీ మార్గంలో సమస్యల పరిష్కారం



రామన్నపేటలో మాట్లాడుతున్న అదనపు జడ్జి చందన

రామన్నపేట/ చౌటుప్పల్ టౌన్, మార్చి 16: రాజీ మార్గంలో సమస్యల పరిష్కారం శాంతి భద్రతలకు సూచిక అని స్థానిక ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రదీప్, అడిషనల్ జడ్జి చందన అన్నారు. మెగా లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం రామన్నపేట కోర్టు ఆవరణలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సివిల్, క్రిమినల్ ఏ కేసులు అయినా పరిష్కారానికి ఇరు వర్గాలు వచ్చి, సమస్యలు పరిష్కరించుకోవచ్చని అన్నారు. లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి న్యాయవాదులు, పోలీసులు, ప్రజా ప్రతినిధులు అందరూ కృషి చేయాలని వారు కోరారు. కక్షిదారులు కోర్టును సంప్రదించి వారి సమస్యలను పరిష్కరించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శోభన్‌బాబు, ప్రభాకర్, నకిరెకంటి మొగులయ్య, డేవిడ్, మామిడి వెంకట్‌రెడ్డి, యాదయ్య, దినేష్, సత్తయ్య, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ మల్లయ్య, కోర్టు సూపరింటెండెంట్ నారగోని గంగాభవాని, బాలగోని శివరాజు, బి.సాయిదీప్ పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్ : చౌటుప్పల్ కోర్టులో నిరహించిన లోక్ అదాలత్ లో 1621 కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకున్నారు. ఇందులో క్రిమినల్ కేసులు 1615 , సివిల్ కేసులు 3, చిన్న కేసులు 3 ఉన్నాయి. సివిల్ కోర్టు జడ్జి మహతివైష్ణవి, బాల్యం వెంకటాచలపతి, తాడూరు పరమేష్, ఊడుగు శ్రీనివాస్, బడుగు శ్రీకాంత్, మహిపాల్ రెడ్డి, బిక్షం పాల్గొన్నారు.

ఆలేరు రూరల్: ఆలేరులోని కోర్టులో లోక్ అదాలత్‌లో 1500 కేసులను పరిష్కరించారు. ఈ కేసుల ద్వారా మొత్తం కాంపౌండ్ ఫీజుగా రూ.6,28,570 వసూలు చేశారు. కార్యక్రమంలో సివిల్ కోర్టు జడ్జి డాక్టర్ సూర సుమలత, అడ్వకేట్లు, పోలీసులు, కక్షిదారులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం


తాళిబొట్టు చూపుతున్న అర్చకుడు, కల్యాణంలో పాల్గొన్న అమిత్‌రెడ్డి, వ్యాఖ్యాత సుమ

భూదాన్‌పోచంపల్లి, మార్చి 16: కనుముకుల పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవ శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 20గ్రాముల బంగారు మంగళ సూత్రాలు, ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను కోట మల్లారెడ్డి - పుష్పలత, ఒట్టం వెంకటరామ్‌రెడ్డి - బాంధవిరెడ్డి సమర్పించారు. కార్యక్రమాలకు టీవీ వ్యాఖ్యాత కనకాల సుమ, బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు గుత్తా అమిత్‌రెడ్డి హాజరయ్యారు. ఉత్సవాల్లో కోట అభిలాష్‌రెడ్డి - శ్రీజరెడ్డి, ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్ రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షురాలు బత్తుల మాధవిశ్రీశైలంగౌడ్, పాటి సుధాకర్‌రెడ్డి, సామ రవీందర్‌రెడ్డి, పగిల్ల సుధాకర్ రెడ్డి, కోట సత్తిరెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

యాదగిరిగుట్ట రూరల్: మహిళలు స్వయం ఉపాధిలో ఆర్థికంగా ఎదగాలని మాజీ సర్పంచ్ మొగిలిపాక తిరుమలరమేష్ అన్నారు. మండలంలోని రామాజీపేట గ్రామంలో ఆరుట్ల కమలాదేవిరాంచంద్రారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుమిషన్ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి నరేష్, మొగిలిపాక శంకర్, కొక్కులకొండ యాదగిరి, కుండె సిద్దులు పాల్గొన్నారు.

వలిగొండ: మండలంలోని పొద్దటూరు గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్వామి, ఉపాధ్యాయులు బాల శంకర్, పాండు, రవీందర్‌రెడ్డి, శ్రీనయ్య, ఆనంద్ పాల్గొన్నారు.

మోత్కూరు : మోత్కూరు మునిసిపాలిటీ నూతన ఛైర్‌పర్సన్ గుర్రం కవితలక్ష్మీనర్సింహారెడ్డిని పాలడుగు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు మర్రిపెల్లి యాదయ్య, అంతటి నర్సయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు అంతటి వెంకటయ్య, మాజీ ఉపసర్పంచ్ ఎడ్ల భగవంతు, దేవాలయ కమిటీ ఛైర్మన్ బండ యాదగిరి, బద్దం సత్తిరెడ్డి పాల్గొన్నారు.

● మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని కొండాపురం గ్రామంలో ఆదివారం (ఈ నెల 17న) శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు పారునంది లక్ష్మణమూర్తి శర్మ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాటాడారు.

చౌటుప్పల్ టౌన్ : చౌటుప్పల్ బార్ అసోసియేషన్‌కు ఈ నెల 28 న ఎన్నికలను నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి కానుగుల వెంకటయ్య తెలిపారు. చౌటుప్పల్ లోని జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 18 నుంచి 20 వ తేదీ వరకు నామినేషన్‌ల స్వీకరణ, 21 న నామినేషన్‌ల పరిశీలన, 22న ఉపసంహరణ, అభ్యర్థుల తుది జాబితా ప్రకటన చేస్తారని తెలిపారు. 28న ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు ఓటింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

చౌటుప్పల్ టౌన్ : క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా భావించాలని చౌటుప్పల్ మునిసిపల్ ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. చౌటుప్పల్ ప్రీమియం టోర్నమెంట్‌ను ఛైర్మన్ రాజు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ తాడూరు వెంకట్ రెడ్డి, జడ్పీటీసీ చిలుకూరు ప్రభాకర్ రెడ్డి, కౌన్సిలర్ పి.శ్రీధర్ బాబు, మాజీ సర్పంచ్ పబ్బు రాజు, కాంగ్రెస్ నాయకులు ఉబ్బు వెంకటయ్య, ఎం.రమేష్ గౌడ్ పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్ : చౌటుప్పల్ మునిసిపాలిటీలో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు మునిసిపల్ ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజు తెలిపారు. మునిసిపాలిటీలోని 16, 17, 18వ వార్డుల్లో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఛైర్మన్ రాజు శంకుస్థాపన చేశారు.

ఆత్మకూరు(ఎం) : పదవ తరగతి వార్షిక పరీక్షల నిర్వాహణకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ రఘురామ్‌రెడ్డి, డిపార్టు మెంటల్ ఆఫీసర్ కె.మహదేవరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని హైస్కూల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో బెంచీలపైన నెంబరింగ్ వేశారు.

భువనగిరి రూరల్: ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశంలో మౌలిక వసతులు కల్పించాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని పీఎంసీ ఆధ్వర్యంలో డీఆర్‌డీవో కృష్ణన్‌కు వినతి పత్రం అందజేశారు. పీపుల్స్ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ సురిపంగ శివలింగం, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్ మాట్లాడారు.

భువనగిరి టౌన్: వేసవి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా భువనగిరి టౌన్ సెక్షన్ పరిధిలో చేపట్టనున్న మరమ్మతుల కారణంగాభువనగిరి పట్టణంలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు గంట పాటు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో టౌన్ ఏఈ పి.సాయికృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మీనానగర్‌తో పాటు మరికొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో జరిగే అంతరాయాన్ని వినియోగదారులు గమనించాలని పేర్కొన్నారు.

రామన్నపేట: మండలంలోని జనంపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మేడి హరికృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు పెన్నులు, పరీక్ష ప్యాడ్లు అందజేశారు.

'రికార్డులకోసం వెళితే డబ్బులు అడుగుతున్నాడు'

సంస్థాన్‌నారాయణపురం, మార్చి 16: భూమి రికార్డులకోసం తహసీల్దార్ కార్యాలయానికి వెళితే తహసీల్దార్ డబ్బులు అడుగుతున్నాడని మండలంలోని వాయిళ్లపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. వాయిల్లపల్లి గ్రామానికి చెందిన బంటు సైదులు నెల్లికంటి బాబు వద్ద 2007సంవత్సరంలో సర్వే నెం.436/2లో 250 గజాల స్థలాన్ని కొనుగోలు చేశాడు. ఇటీవల ఆ భూమిని పట్టా చేయించుకునేందుకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాడు. అక్కడి అధికారులు కొనుగోలు చేసిన భూమి యొక్క వాస్తవ స్వభావానికి సంబంధించిన రికార్డులు తహసీల్దార్ కార్యాలయం నుంచి తీసుకురావాలని చెప్పారు. దీంతో భూమిని పట్టా చేయించుకునేందుకు సర్వే రిపోర్ట్ కోసం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేశాడు. రికార్డు ఇవ్వాలని కోరితే డిప్యూటీ తహసీల్దార్‌ను కలవాలని కొంతకాలం, ఎంఆర్‌ఐని కలవాలని మరి కొంతకాలం కార్యాలయం చుట్టూ తిప్పుతూ తనను ఇబ్బందులకు గురిచేసినట్లు ఆరోపించారు. రూ.30వేలు ఇస్తే పని పూర్తి చేస్తానని ఓ మధ్యవర్తి ద్వారా తహసిల్దార్ తనకు సమాచారం పంపినట్లు బంటు సైదులు ఆరోపించారు. డబ్బులు ఎందుకు ఇవ్వాలని నిలదీసినందుకు రికార్డులు దొరకడం లేదని చెప్తున్నట్లు సైదులు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయమై తహసీల్దార్ కృష్ణ మాట్లాడుతూ వాయుళ్లపల్లి గ్రామానికి చెందిన బంటు సైదులుకు సంబంధించిన భూమి ప్రభుత్వానిదా?, ప్రైవేటుదా అనేది రికార్డుల్లో చూడాల్సి ఉందని అన్నారు. తనకు సమయం లేక చూడలేదని తెలిపారు. ఎవరిని నేను డబ్బులు అడగలేదని, రూ.30,000 అడిగాననేది అవాస్తవమని అన్నారు. తాను కార్యాలయంలో లేనప్పుడు కార్యాలయానికి వచ్చి రాద్ధాంతం చేయడం సరికాదని అన్నారు.

అండర్‌పాస్ ఏర్పాటుచేయాలి: సీపీఎం


నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

భువనగిరి రూరల్, మార్చి 16: భువనగిరి శివారులోని పెంచికల్‌పహడ్ చౌరస్తా వద్ద అండర్‌పాస్ నిర్మాణం ఏర్పాటు చేసి, ప్రజల ప్రాణాలను కాపాడాలని సీపీఎం మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ డిమాండ్ చేశారు. శనివారం భువనగిరి పట్టణ పరిధిలోని పెంచికల్‌పహడ్ చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భువనగిరి, వలిగొండ, ఆత్మకూరు, మండలాలకు వెళ్లే ప్రయాణికులు గత్యంతరం లేక ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ఈ మార్గం గుండానే రవాణా చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సిలివేరు ఎల్లయ్య, వడ్డెబోయిన వెంకటేష్, రాజు కృష్ణ, శ్రవణ్‌కుమార్, అండాలు, మల్లేష్, మహేష్ ఉన్నారు.

గ్రేస్‌బాల్ క్రికెట్ రాష్ట్రస్థాయి విజేతగా గజ్వేల్ జట్టు

తుర్కపల్లి, మార్చి 16: మండల కేంద్రంలో గొంగిడి మహేందర్‌రెడ్డి యువసేన ఆధ్వర్యంలో శనివారం జరిగిన రాష్ట్ర స్థాయి గ్రేస్ బాల్ క్రికెట్ ఫైనల్ పోటీల్లో సిద్దిపేట జిల్లా గజ్వేల్ జట్టు విజేతగా నిలిచింది. తుర్కపల్లి మండలంలోని శ్రీనివాసపురం, గజ్వేల్ జట్లు ఫైనల్ పోటీల్లో తలపడగా గజ్వేల్ జట్టు విజయం సాధించగా శ్రీనివాసపురం జట్టు రన్నర్ అప్‌గా నిలిచింది. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మహేందర్‌రెడ్డి యువసేన అధ్యక్షుడు తలారి శ్రీనివాస్ మొదటి బహుమతి సాధించిన గజ్వేల్ జట్టుకు ట్రోఫీతో పాటు లక్ష రూపాయల నగదును, ద్వితీయ బహుమతి సాధించిన శ్రీనివాసపురం జట్టుకు రూ. 50వేలు, ట్రోఫీని అందజేశారు. ఈ క్రికెట్ పోటీల్లో మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా సురేశ్, ఉత్తమ బౌలర్‌గా రమేశ్, మ్యాన్ ఆఫ్‌ది సిరీస్‌గా రాజు ఎంపికయ్యారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు భూక్య రవీందర్‌నాయక్, నిర్వాహకులు బాబు, మల్లేశ్, జహంగీర్, రవి, వినోద్, నవీన్, గణేశ్, ఎర్ర నవీన్ ఉన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

సంస్థాన్‌నారాయణపురం/ చౌటుప్పల్ టౌన్/ రామన్నపేట, మార్చి 16: సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు ఎండి అక్బర్ అలీ, జక్కిడి చంద్రారెడ్డి, రత్తుపల్లి యాదయ్య, మినుగు గోపాల్, అంతటి స్వామి గౌడ్ పాల్గొన్నారు. పేద వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్‌లను ఏర్పాటు చేయడం హర్షనీయమని చౌటుప్పల్ మునిసిపల్ ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శనివారం చౌటుప్పల్ పట్టణంలోని పెద్దమ్మ దేవాలయం వద్ద సీఎం రేవంత్ రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిల చిత్రపటాలకు ఛైర్మన్ రాజు ఆధ్వర్యంలో ముదిరాజ్ లు క్షీరాభిషేకం చేశారు. పెద్దమ్మ తల్లి దేవాలయం అధ్యక్షుడు బి. ధనేష్, ముదిరాజ్, ఎ .గోవింద్ రాజ్, గుండ్ల శంకరయ్య, బి.మురళి పాల్గొన్నారు. రామన్నపేటలో పెరిక సంఘం సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. టెలికాం బోర్డు మాజీ మెంబర్ గోదాసు శ్రీమన్నారాయణ, పెరికల కుల సంఘం నాయకులు గోదాసు సుగ్రీవులు, కోట సుధాకర్, గోదాసు పృథ్వీరాజ్, గోదాసు శ్రీనివాస్, ఎడ్లే రాజు, బాల్తు నాగయ్య, గోదాసు సాయి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత అరెస్టుపై నిరసనల వెల్లువ

ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్: ఎమ్మెల్సీ కవిత అరెస్టుపై పలుచోట్ల నిరసనలు వెల్లువెత్తాయి. ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్రంలో ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి లబ్ధి చేకూర్చడానికి, బీఆర్ఎస్ పార్టీని అణగతొక్కడానికి ఎమ్మెల్సీ కవితను అన్యాయంగా అరెస్టు చేయించారని బీఆర్ఎస్ అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, ఆలేరు మార్కెట్ కమిటి మాజీ ఛైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, జడ్పీటీసీ సభ్యురాలు తోటకూరి అనురాధబీరయ్య అన్నారు. యాదగిరిగుట్ట కార్యకర్తలు రాస్తారోకో చేశారు. మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ కాటం రాజు, కౌన్సిలర్లు బేడిద సురేందర్, ఆవుల మమతసాయి, నాయకులు మిట్ట వెంకటయ్యగౌడ్, పల్లెపాటి బాలయ్య, ఆరె. యాదగిరిగౌడ్, భీమగాని నర్సింహ్మాగౌడ్, కోల వెంకటేష్‌గౌడ్, అంకం నర్సింహ పాల్గొన్నారు.

● తుర్కపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో భువనగిరి-గజ్వేల్ రహదారిపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టి బొమ్మను దహనం చేసారు. జడ్పీ వైస్ ఛైర్మన్ ధానావతు బీకునాయక్, ఎంపీపీ భూక్య సుశీలరవీందర్‌నాయక్, నాయకులు నాంసాని సత్యనారాయణ బానోతు భాస్కర్‌నాయక్, నల్ల శ్రీకాంత్, గుంటి శ్రీశైలం, పరమేశ్ ఉన్నారు.

●ఆలేరులో బస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ ఎంపీ ఎన్నికల్లో అత్యధిక సీట్లు సాధిస్తున్న కక్షతోనే కవితను అరెస్ట్ బీఆర్ఎస్ నాయకులు అన్నారు. మునిసిపల్ ఛైర్మన్ శంకరయ్య, కౌన్సిలర్లు నర్సింహులు, శ్రీకాంత్, దయామని, నాయకులు పుట్ట మల్లేశ్, గంగుల శ్రీనివాస్, మురళి, శంకర్, హరినాథ్ ఉన్నారు.

● భూదాన్‌పోచంపల్లి పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేస్తూ కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, రైతు సమన్వయసమితి మండల కన్వీనర్ రావుల శేఖర్ రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షురాలు బత్తుల మాధవిశ్రీశైలంగౌడ్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ బాత్క లింగస్వామియాదవ్, కౌన్సిలర్ మల్లారెడ్డి పాల్గొన్నారు.

● మోటకొండూర్ మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు ఎండి.బురాన్, యువజన విభాగం మండల అధ్యక్షుడు బొట్ల మహేష్, నియోజకవర్గ యువజన విభాగం జనరల్ సెక్రెటరి జివిలికపల్లి వెంకటేష్, బీఆర్ఎస్వీ పట్టణ అధ్యక్షుడు బొట్ల ప్రశాంత్, నాంపల్లి భాను, రుద్రబోయిన సిద్దు, రాకేష్, నవీన్ పాల్గొన్నారు.


ఆలేరులో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


యాదగిరిగుట్టలో ఆందోళన నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు


భూదాన్‌పోచంపల్లిలో కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు